సాక్షి
బాపట్ల

శనివారం । 17 । మే । 2025



వికసించిన మే పుష్పం

దుగ్గిరాల: దుగ్గిరాలలో శుక్రవారం పాస్టర్ మండేపూడి ఐజయ్య ఇంట్లో మే పుష్పం వికసించింది. సంవత్సరానికి ఒక్కసారి పూసే ఈ పుష్పం చూపరులు ఆకట్టుకుంటుంది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.70 అడుగుల వద్ద ఉంది. ఇది 136.3003 టీఎంసీలకు సమానం.



'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవం

బాపట్ల: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ శుక్రవారం బాపట్లలో నిర్వహించారు. మాజీ సైనికులు, మున్సిపల్ అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు వేమూరులో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

బాపట్ల :జిల్లాలోని వేమూరులో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తునట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'వేడిని తట్టుకోవటం' అనే అంశంపై వేమూరులో శనివారం ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి, వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు పాల్గొంటారని తెలిపారు.

డీఎస్సీకి 25,067 మంది దరఖాస్తు



గుంటూరుఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన డీఎస్సీ-2025 దరఖాస్తు ఘట్టం మగిసింది. గురువారం అర్ధరాత్రి గడువు ముగిసే సమయానికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులకు 25,067 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హత ప్రాతిపదికన సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఒక దరఖాస్తు దాఖలు చేసిన అభ్యర్థులతోపాటు రెండు పోస్టులకు కలిపి దాఖలు చేసిన దరఖాస్తులతో కలుపుకొని ఆన్‌లైన్‌లో మొత్తం 43,570 దరఖాస్తులు దాఖలయ్యాయి. పురుష అభ్యర్థులు 8,431 మంది ఉండగా, మహిళా అభ్యర్థులు 16,636 మంది ఉన్నారు. ఇక ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) జూన్ 6వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 20 నుంచి మాక్ టెస్ట్‌లు జరగనున్నాయి. 30 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడింగ్, జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు ఆయా కేటగిరీల వారీగా పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ 622, ఎస్జీటీలు 521 ఉన్నాయి. వీటితోపాటు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరో 16 పోస్టులు భర్తీ చేయనున్నట్లు చూపారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా తెలుగు 42, హిందీ 57, ఇంగ్లీషు 69, గణితం 35, ఫిజికల్ సైన్స్ 58, బయోలాజికల్ సైన్స్ 86, సోషల్ 109, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166తోపాటు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 521 ఉన్నాయి.

పంచాయతీ వనరుల కేంద్ర భవన నిర్మాణ పనుల పరిశీలన



గుంటూరుఎడ్యుకేషన్: గుంటూరులోని జెడ్పీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర భవన పనులను శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణతేజ పరిశీలించారు. శుక్రవారం నగరానికి వచ్చిన కృష్ణతేజ, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతోపాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో కలసి భవన నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం జెడ్పీ కార్యాలయాన్ని సందర్శించిన కృష్ణతేజ శిథిలావస్థకు చేరిన పరిపాలన భవనానికి మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, జిల్లా పంచాయతీ అధికారి బీవీ సాయికుమార్, డ్వామా, డీఆర్‌డీఏ, జెడ్పీ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తెనాలిటౌన్: స్థానిక శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిత్యహోమం , కలశ పూజ, అలయ బలిహరణ వంటి కార్యక్రమాలను దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టారు. అదే విధంగా సాయంత్రం 6.30 గంటలకు శేష వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

వరి వంగడాలు రెడీ

- ఈ నెల 25 నుంచి పంపిణీ ప్రారంభం
- వంద ప్రైవేటు కంపెనీలకు 350 క్వింటాళ్ల బ్రీడర్ సీడ్
- ఏపీతో పాటు తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు అందజేత
- రైతులకు 1750 క్వింటాళ్ల ఫౌండేషన్ విత్తనాలు
- ఏపీ సీడ్స్, నేషనల్ సీడ్ కార్పొరేషన్‌కు కూడా..
- విత్తనాలు సిద్ధం చేసిన బాపట్ల వ్యవసాయపరిశోధనా స్థానం, వ్యవసాయ కళాశాల క్షేత్రం



బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం

సాక్షి ప్రతినిధి, బాపట్ల : దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు పొందిన బాపట్ల (బీపీటీ) వరి విత్తనాలు పంపిణీకి సిద్ధమయ్యాయి. వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం ఇప్పటికే సిద్ధం చేసిన వరి విత్తనాలను బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ కళాశాల క్షేత్రాలు ఈ నెల 25 నుంచి పంపిణీ చేస్తున్నాయి. సుమారు 127 ఎకరాల్లో సాగు చేసి ఉత్పత్తి చేసిన 16 రకాల వరి విత్తనాలను దేశ వ్యాప్తంగా సరఫరా చేయనున్నారు. సుమారు వంద ప్రైవేట్ కంపెనీలతో పాటు ఏపీ సీడ్స్, నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా లక్షలాది మంది రైతులకు వరి వంగడాలు అందజేయనున్నారు. ఈ విత్తనాలతో దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో వరిపంట సాగుకానుంది. ప్రతిఏటా బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ కళాశాల క్షేత్రాలు నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తిచేసి రైతులకు అందిస్తున్నాయి.

- రాబోయే ఖరీఫ్‌కు గాను వ్యవసాయ పరిశోధనా స్థానం బ్రీడర్ సీడ్‌గా 2782 రకం 40.20 క్వింటాళ్లు, 2270 రకం 70.80, 2595-32.10, 2846-23.40, 2231-7.80, 2411-4.50, 2295-7.20, 3291-10.08, 2841 రకం 15.80 కింటాళ్ల చొప్పున ఉత్పత్తి చేశాయి.
- పౌండేషన్ సీడ్‌గా 2595 రకం 50.40 కింటాళ్లు, 2846-85.80 క్వింటాళ్లు ఉత్పత్తి చేశారు.
- మినీకిట్ రకాలు బీపీటీ 2776-13.20 క్వింటాళ్లు, 2766- 9.30, 3082 రకం 45 క్వింటాళ్ల చొప్పున దాదాపు 27 ఎకరాల్లో మొత్తం 550 క్వింటాళ్ల సీడ్ ఉత్పత్తి చేసింది. ఇందులో బ్రీడర్ సీడ్‌గా ఉత్పత్తి చేసిన 350 క్వింటాళ్ల విత్తనాలను ఏపీలోని పలు విత్తన కంపెనీలతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ తదితర జిల్లాలకు చెందిన కంపెనీలకు విక్రయించనున్నారు.
- నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా దేశవ్యాప్తంగా పశ్చిమ బెంగాల్, ఒడిశా, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సైతం బీపీటీ వరి విత్తనాలు అందించనున్నారు.
- ఇక్కడ ఉత్పత్తి చేసిన వరి వంగడాలను బ్రీడర్ రకం కిలో రూ.77.80 , మినీ కిట్లు కిలో రూ. 50, పౌండేషన్ సీడ్ రూ.47కు విక్రయిస్తున్నట్లు ప్రిన్సిపల్ సైంటిస్ట్ కృష్ణవేణి 'సాక్షి'కి తెలిపారు.

దేశంలోనే ప్రఖ్యాతి ఫౌండేషన్ సీడ్...

- బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రంలో ఫౌండేషన్ సీడ్‌గా దేశంలోనే ప్రఖ్యాతి చెందిన బీపీటీ 5204 రకం విత్తనాలతోపాటు 2270, 2595, 2782 రకం విత్తనాలను 101 ఎకరాల్లో దాదాపు 1600 క్వింటాళ్లు ఉత్పత్తి చేశారు. ఇప్పటికే విత్తనాలను 30 కిలోల పాకెట్లుగా పంపిణీకి సిద్ధంగా ఉంచారు.
- కిలో విత్తనాలను రూ.47 ప్రకారం 30 కిలో పాకెట్‌ను రూ.1410కి విక్రయించనున్నారు. ఈ విత్తనాలను ఈ ప్రాంతంలోని రైతులకు మాత్రమే పంపిణీ చేయనున్నారు. ఈ నెల 25 వ తేదీ నుంచి విత్తనాల పంపిణీ మొదలు పెట్టనున్నట్లు కళాశాల సీనియర్ సైంటిస్ట్ హెడ్ అరుణ 'సాక్షి'కి తెలిపారు.
- ఏపీ సీడ్ సర్టిఫికేషన్ వారు జారీచేసిన అనుమతితో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు సూచించిన సుమారు వంద రకాల సీడ్ కంపెనీలకు విత్తనాలను బ్రీడర్ సీడ్‌గా విక్రయించి మిగిలిన సీడ్‌ను ఇక్కడి రైతులకు నేరుగా అందజేస్తారు.

బీపీటీ 5204కు డిమాండ్

1986లో బాపట్లలో ఉత్పత్తి చేసిన బీపీటీ 5204 రకం వరి పంట కాలం 140 నుంచి 145 రోజులుకాగా బియ్యం తెలుపు రంగులో సన్నగా ఉండి అన్నానికి అనుకూలంగా ఉంటుంది. 1000 గింజల బరువు 14.5 గ్రాములు ఉండి అధిక దిగుబడినిస్తుంది. వినియోగ దారులు ఇష్టపడే ఈ రకానికి డిమాండ్ అధికం. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 20 లక్షల హెక్టార్లలో రైతులు ఈ రకాన్ని సాగుచేస్తున్నారు.

- నేషనల్ సీడ్ కార్పొరేషన్ బాపట్ల వ్యవసాయపరిశోధనా స్థానంలో ఉత్పత్తి చేసిన బ్రీడర్ సీడ్‌ను తీసుకొని ఫౌండేషన్ సీడ్‌గా పునరుత్పత్తిచేసి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున రైతులకు అందజేస్తోంది.
- మరోవైపు ఏపీ సీడ్స్‌తోపాటు పలు ప్రైవేట్ సీడ్ కంపెనీలు ఇక్కడ ఉత్పత్తి చేసిన పలురకాల బ్రీడర్ సీడ్ కొనుగోలు చేసి ఫౌండేషన్ సీడ్‌గా మార్చి రెండు తెలుగు రాష్ట్రాల రైతులకు అందిస్తున్నారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

25 నుంచి విత్తనాలు సరఫరా



బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఇప్పటి వరకూ 16 రకాల వరి వంగడాలను ఉత్పత్తి చేశాం. ప్రతి ఏటా ఇక్కడ సీడ్‌ను ఉత్పత్తిచేసి ప్రభుత్వ, ప్రైవేటు సీడ్ కంపెనీలకు ఇస్తున్నాం. ఈ ఏడాది 27 ఎకరాల్లో దాదాపు 16 రకాల బీపీటీ వరి విత్తనాలను బ్రీడర్, ఫౌండేషన్, మినీ కిట్లుగా ఉత్పత్తి చేశాం. 350 క్వింటాళ్ల ప్రైవేటు కంపెనీలకు సరఫరా చేస్తాం. మిగిలింది ఇక్కడి రైతులకు పంపిణీ చేస్తాం.

– కృష్ణవేణి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్, వ్యవసాయ పరిశోధనా స్థానం, బాపట్ల

రైతుల కోసం ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి

బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం పరిధిలో ఈ ఏడాది 101 ఎకరాల్లో బీపీటీ 5204, 2782, 2595, 2270 నాలుగు రకాల వరి విత్తనాలను ఫౌండేషన్ సీడ్‌గా ఉత్పత్తి చేశాం. 5 వేల 30 కిలోల పాకెట్లు సిద్ధంగా ఉంచాం. ఈ నెల 25 నుంచి విత్తనాలను నేరుగా ఈ ప్రాంత రైతులకు అందిస్తున్నాం. విత్తనాలు అవసరమైన రైతులు వ్యవసాయ కళాశాల క్షేత్రానికి వచ్చి తీసుకుపోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా అవకాశమున్న మేర వరి విత్తనాలను పంపిణీ చేస్తాం. – అరుణ, సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్, వ్యవసాయకళాశాల క్షేత్రం, బాపట్ల

నేర నియంత్రణలో డ్రోన్ల పాత్ర కీలకం

- జిల్లా పోలీస్‌శాఖకు మూడు డ్రోన్లు అందించిన దాతలు
- దాతలను అభినందించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



బాపట్లటౌన్: నేరాల నియంత్రణలో డ్రోన్ల పాత్ర ఎంతో కీలకమైందని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ తుషార్ డూడీకి దాతలు డ్రోన్లను అందజేశారు. మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సభ్యులు, బల్లికురవ మండలానికి చెందిన సూర్య డెయిరీ ప్రొప్రయిటర్ ఇప్పర్ల అంజిరెడ్డి, సంతమాగులూరు మండలానికి చెందిన గడిపర్తి రామకృష్ణలు ఎస్పీకి మూడు డ్రోన్లు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో సాంకేతికతను వినియోగించుకొని సమర్థంగా విధులు నిర్వహించేందుకు డ్రోన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లా పోలీస్‌కు అత్యాధునిక డీజేఐ ఎయిర్ 3ఎస్ డ్రోన్‌లను అందజేశారని తెలిపారు. పోలీసు సిబ్బంది వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో నిఘా పెట్టడం ద్వారా నేరాల అదుపునకు చర్యలు తీసుకోవచ్చన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్న ప్రదేశాలను డ్రోన్ల ద్వారా త్వరగా గుర్తించడం ద్వారా వేగవంతంగా సహాయక చర్యలు నిర్వహించడంతోపాటు ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించవచ్చన్నారు. వీఐపీల బందోబస్తులు, తిరునాళ్లు, ర్యాలీలు, ఊరేగింపులు జరిగే సమయాల్లో డ్రోన్లను వినియోగించుకొని అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పర్యవేక్షించవచ్చన్నారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, మార్టూరు సీఐ శేషగిరిరావు, సంతమాగులూరు సీఐ వెంకటరావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజు, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

ఏడుగురికి యావజ్జీవ కారాగార శిక్ష

వ్యక్తిని కిరాతకంగా హత్యచేసిన కేసులో తీర్పు

- ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా
- పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

చీరాల రూరల్: ఓ వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో ఏడుగురు నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా విధిస్తూ ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.పూర్ణిమ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన మృతుడు మోసా సూరిబాబు (30) వద్ద రెండేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన పిక్కి సింహాద్రి రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించమని సూరిబాబు అనేకసార్లు సింహాద్రిని అడిగినా అప్పు తీర్చలేకపోయాడు. అంతేకాక సూరిబాబుకు సింహాద్రి భార్యతో అక్రమ సంబంధం ఉన్నదని గ్రామంలో కొంతమంది చర్చించుకుంటున్న విషయం సింహాద్రి దృష్టికి వచ్చింది. ఈ విషయమై సింహాద్రి తనభార్యతో పాటు సూరిబాబుపై అనుమానం పెంచుకున్నాడు. అనుమానం పెనుభూతంగా మారడంతో సూరిబాబును ఎలాగైనా చంపాలని సింహాద్రి నిర్ణయించుకున్నాడు. ఈ విషయంలో సహకరించాల్సిందిగా సింహాద్రి తన కొడుకు, కూతురుతోపాటు గ్రామంలో మరో ఆరుగురు పిక్కి శాంతి, బొంది డేవిడ్, పిక్కి రాజు, పిక్కి ఆనంద్, పిక్కి సత్తెమ్మ, ఓరుపుల మాణిక్యరావుల సాయం కోరాడు. అందుకు అందరూ అంగీకరించడంతో సూరిబాబును చంపేయాలని పథకాన్ని అమలు చేసేందుకు వ్యూహ రచన చేశాడు.

కూతురు వివాహం పేరుతో..

అయితే సింహాద్రి తన కుమార్తైను మృతుడైన సూరిబాబుకు ఇచ్చి వివాహం చేస్తానని నమ్మించాడు. తన ఇంటికి భోజనానికి రావాలని సూరిబాబును ఐదు రోజుల నుంచి సింహాద్రి ఆహ్వానిస్తున్నాడు. 10 అక్టోబర్ 2023న రాత్రి 8 గంటల సమయంలో సూరిబాబు, సింహాద్రికి ఫోన్‌చేసి భోజనానికి ఆహ్వానించడంతో సూరిబాబు అంగీకరించాడు. సూరిబాబు భోజనానికి వస్తున్న విషయంపై నిందితులకు ముందుగానే సమాచారం అందించాడు. సింహాద్రి వారందరికి కర్రలు, ఇనుపరాడ్లు, పైపులు అందించి తన ఇంటిలో దాచాడు. సింహాద్రి మాటలు నమ్మిన సూరిబాబు రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన సింహాద్రితోపాటు అందరూ కలిసి సూరిబాబుపై ఇష్టమొచ్చినట్లు దాడి చేశారు. మృతుడు సూరిబాబు అక్క ఎల్లియమ్మ తన తమ్ముడు ఇంటి వద్ద లేకపోవడంతో అనుమానం వచ్చి తన బంధువులను తీసుకుని సింహాద్రి ఇంటికి వెళ్లింది. సూరిబాబు ఇక్కడకు రాలేదని సింహాద్రి కూతురు మరికొందరు కలసి ఎల్లియమ్మ ఆమె బంధువులను అడ్డగించి వాదనకు దిగారు. ఇంటిలోపల ఏదో జరుగుతుందని అనుమానం వచ్చి ఎల్లియమ్మ ఆమె బంధువులు కలసి బలవంతంగా ఇంటిలోపలకు ప్రవేశించారు. దీంతో సూరిబాబు తీవ్రగాయాలతో రక్తపు మడుగులో పడి ఉండటం గమనించి చికిత్స నిమిత్తం ఆటోలో చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సూరిబాబును పరిశీలించిన డ్యూటీలో ఉన్న వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు సూరిబాబు అక్క ఎల్లియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పైన పేర్కొన్న నేరస్తులందరిపై ఈపురుపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

జీవిత ఖైదు.. జరిమానా..

బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఎ.మల్లికార్జునరావు నిందితులపై హత్యానేరం కింద కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.పూర్ణిమ కేసును పూర్తిస్థాయిలో విచారించారు. నిందితులపై ఉన్న నేరారోపణలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వరరెడ్డి పోలీసుల సాయంతో సరైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి తన వాదలతో నిరూపించారు. దీంతో న్యాయమూర్తి ఏడుగురు నిందితులకు హత్యానేరం కింద జీవిత ఖైదు విధించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నేరస్తులకు శిక్షలుపడే విధంగా కృషిచేసిన అప్పటి సీఐ ఎ. మల్లికార్జునరావు, ప్రస్తుత సీఐ పి.శేషగిరిరావు, జిల్లా కోర్టు కానిస్టేబుల్ షేక్ కరిముల్లా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వర రెడ్డిని ప్రత్యేకంగా ఎస్పీ అభినందించారు.

అకాల వర్షం.. అతలాకుతలం

జనమంతా గాఢనిద్రలో ఉన్నారు. అర్ధరాత్రి పెద్ద పెద్ద శబ్దాలు. ఉలిక్కిపడి లేచారు. అంతా అంధకారం. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, జోరున వర్షం. ఈదురుగాలులకు వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సరఫరా నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- తటాకాలను తలపించిన రహదారులు
- విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు
- నిలిచిన సరఫరా..గ్రామాల్లో అంధకారం
- నేలకొరిగిన వృక్షాలు



రేపల్లె పట్టణంలోని రాజ్యలక్ష్మి థియేటర్ సెంటరులో నిలిచిన వర్షపు నీరు

రేపల్లె: రేపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వర్షంతో నియోజకవర్గంలోని పలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో రహదారులు నీటమునిగాయి. అయితే పలు ప్రధాన రహదారులు వర్షపు నీరు నిలవడంతో తటాకాలను తలపించాయి. వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలోని రాజ్యలక్ష్మి థియేటర్ సెంటర్, నిజాంపట్నం రోడ్డు, బస్టాండ్ సెంటర్, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, ప్రకాశం రోడ్డుతోపాటు పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలలోని రహదారులు జలమయమయ్యాయి. వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో పట్టణంలో రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కూలిన ధ్వజస్తంభం

తెల్లవారుజామున వీచిన ఈదురుగాలులకు నిజాంపట్నం మండలం అడవులదీవిలోని శ్రీ భ్రమరాంబ సహిత మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆవరణంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం ముందు ఉన్న ధ్వజ స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో ఆలయంలో ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.



కూచినపూడిలో కూలిన ధ్వజస్తంభం

వర్షపాత వివరాలు

రేపల్లెలో 50.8 మిల్లీమీటర్లు, నిజాంపట్నంలో 36.4, నగరంలో 33.6, చెరుకుపల్లిలో 30.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

బెంబేలెత్తించిన వాన



పొంగి పొర్లుతున్న యద్దనపూడి-వింజనంపాడు వాగు

యద్దనపూడి/కారంచేడు/మార్టూరు: ఎండలతో అల్లాడిన ప్రజలకు వరుణుడు ఉపశమనం కలిగించాడు. శుక్రవారం వేకువజామున 4 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. వర్షానికి తోడు మెరుపులు, ఉరుములు, బీకర గాలులు దడ పుట్టించాయి. యద్దనపూడి మండలంలో మొత్తంగా 128.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైయింది. దీంతో యద్దనపూడి-వింజనంపాడు, పోలూరు గ్రామాల వద్ద వాగులు పొంగి పొర్లాయి. గాలివాన బీభత్సానికి పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వింజనంపాడు గ్రామంలో చెట్టు విరిగి కరెంట్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది గ్రామానికి వెళ్లే వీలులేక పోవటంతో చిలకలూరిపేట వైపుగా వెళ్లి విద్యుత్ తీగలను సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. కారంచేడు గ్రామంలో 57.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పర్చూరులో 81.4, మార్టూరులో 5 సెంటీమీటర్ల, ఇంకొల్లు 69.2 మిల్లీమీటర్లు, నియోజకవర్గంలో అత్యల్పంగా చినగంజాం మండలంలో 35.6 మిల్లీమీటర్లు నమోదు కాగా జిల్లాలో అత్యధికంగా యద్దనపూడి మండలంలో 128.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైట్లు అధికారులు తెలిపారు.



వింజనంపాడులో విద్యుత్ తీగలపై విరిగి పడిన చెట్టు

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



చుండూరు మండలంలో పొలాల్లో పడి పోయిన విద్యుత్ స్తంభం

వేమూరు: శుక్రవారం తెల్లవారుజామున వీచిన ఈదురుగాలులు, అకాల వర్షం వల్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వేమూరు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు బాధలు పడ్డారు. చుండూరు మండలంలో అరటి తోటలు నేలవాలాయి. శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ

బాపట్ల: దోమకాటు ఆరోగ్యానికి చేటు అని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. డెంగీ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యశాఖ, మున్సిపాల్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ దోమకాటు మానవాళి ఆరోగ్యానికి చేటు అని, కీటక జనిత వ్యాధులకు దోమకాటు మూలమని పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలో డెంగీ మరణాలు లేవన్నారు. అందరికీ ఆరోగ్యం అందరి బాధ్యత అని గుర్తేరగాలన్నారు. బాపట్ల మునిసిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ మునిసిపల్ శాఖ, ఆరోగ్యశాఖ పరస్పర అవగాహనతో పట్టణంలో దోమలు నిర్మూలనకు చర్యలు చేపడుతామన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ డెంగీ లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పట్టణంలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణకు ఒప్పకోని రైతులు

కుందుర్రు, మావిళ్లపల్లిలో ప్రత్యేక గ్రామసభ

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రభుత్వం ఏర్పాటు చేసే సోలార్ ఇంధన ఉత్పాదక కేంద్రానికి తమ భూములు ఇవ్వబోమని గ్రామస్తులు ముక్తకంఠంతో పలికారు. సంతమాగులూరు మండలం మావిళ్లపల్లి గ్రామ రైతులు శుక్రవారం జరిగిన గ్రామసభలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు తెలియజేశారు. మండలంలోని కుందుర్రు, మావిళ్లపల్లి గ్రామాలలో 1500 ఎకరాల భూమి కావాలని అధికారులు కోరగా తాము భూమినే నమ్ముకుని వ్యవసాయం, పశుపోషణతో జీవానాన్ని వెళ్లదీస్తున్నామని గ్రామస్తులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. సోలార్ పార్క్ ఏర్పాటు పేరిట తమ భూములు లాక్కోవడం తీరని అన్యాయమని రైతులు ముక్తకంఠంతో నిరాకరించారు. దీంతో చేసిదిలేక రెవెన్యూ అధికారులు సభను అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

నీట్‌లో బాపట్ల విద్యార్థినికి 47వ ర్యాంక్


పీటా జ్యోతిర్మయి

బాపట్ల టౌన్: గత నెలలో జరిగిన నీట్ పీజీ ఎండీఎస్ ప్రవేశపరీక్షలో బాపట్ల పట్టణానికి చెందిన పీటా జ్యోతిర్మయి ఆల్ ఇండియా స్థాయిలో 47వ ర్యాంక్ సాధించారు. సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన జ్యోతిర్మయి ఇంటర్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ సాధించారు. సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో బీడీఎస్ పూర్తిచేసిన జ్యోతిర్మయి ప్రస్తుతం ఆల్ ఇండియా 47వ ర్యాంకు సాధించడం పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.

పిడుగు పడి గేదె మృతి

కర్లపాలెం: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షాలకు పిడుగు పడి ఓ గేదె మృతిచెందిన సంఘటన పెదగొల్లపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గురువారం రాత్రి ఈదురుగాలులు మెరుపులతో కురిసిన వర్షాలకు పిడుగుపడి పెదగొల్లపాలెం గ్రామానికి చెందిన బత్తుల అమరయ్యకు చెందిన రూ.లక్ష విలువ గలిగిన గేదె మృతిచెందినట్లు తెలిపారు.

వేసవి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం:దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో సమ్మర్ స్పెషల్ రైళ్లు ప్రయాణికుల సౌకర్యార్థం కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం తెలిపారు. చర్లపల్లి–విశాఖపట్నం(07441) రైలు ఈనెల 17న చర్లపల్లి స్టేషన్‌లో మధ్యాహ్నం2.30 గంటలకు బయల్దేరనుందన్నారు. మరుసటిరోజు మధ్యాహ్నం 3.35 గంటలకు విశాఖపట్నం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. విశాఖపట్నం–చర్లపల్లి(07442) ఈనెల 18న విశాఖపట్నం నుంచి రాత్రి 11 గంటలకు బయల్దేరి చర్లపల్లి స్టేషన్‌కు మరుసటిరోజు ఉదయం 11.40 గంటలకు చేరుకుంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


కొండమ్మ (ఫైల్)

నూజెండ్ల: త్రిపురాంతకం మండలంలో గురువారంరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నూజెండ్ల మండలానికి చెందిన మహిళ మృతి చెందింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని మృత్యుంజయపురం గ్రామానికి చెందిన వజ్రగిరి కొండమ్మ (45) తన బంధువులతో కలిసి పుల్లలచెరువు మండలం చౌటప్పచర్ల గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో గుట్టపల్లి వద్ద జాతీయ రహదారిపై వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో కొండమ్మ మృతి చెందింది. కారులో ప్రయాణిస్తున్న కొదమల కుమారి, షారోన్, ప్రశాంత్ రాజ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి.

ఆహార భద్రతా నియమాలు పాటించాలి

చీరాలలోని పలు హోటల్స్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలు


బాలాజీ హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రభాకరరావు

చీరాల అర్బన్: హోటల్స్ యజమానులు ఆహార భద్రతా నియమాలను పాటించాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి గరికపాటి ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం ఆయన చీరాలలోని హోటల్స్, స్వీట్ కార్ఖానాలను పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని బాలాజీ టిఫిన్ సెంటర్‌ను పరిశీలించారు. టిఫిన్స్ తయారీ కోసం ఉపయోగించే పప్పు దినుసుల శాంపిల్స్ పరిశీలించారు. పప్పు దినుసులలో రంగులు ఉన్నట్లు గుర్తించారు. టిఫిన్స్‌కు ఉపయోగించే పప్పు దినుసులు సక్రమంగా లేవని, నాణ్యత ఉన్న వాటిని వినియోగించుకోవాలని యజమానికి సూచించారు. ధనియాలు రంగు రావడానికి రంగులు కలుపుతున్నారని, అటువంటి వాటిని వినియోగించవద్దని హెచ్చరించారు. అనంతరం హోటల్స్‌లో వాడే నూనె నాణ్యతను పరిశీలించారు. హోటల్స్‌లోని వంట గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అనంతరం పాలిమేర రోడ్డులోని జానకి టిఫిన్ సెంటర్‌ను పరిశీలించారు. పప్పు దినుసులు నాణ్యమైనవి వాడాలని సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హోటల్‌కు ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకపోవడంతో యజమానికి నోటీసులు జారీ చేశారు. 14 రోజుల్లో ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తీసుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చీరాల గొల్లపాలెంలోని అను స్వీట్స్ కార్ఖానాను ఆయన పరిశీలించారు. కార్ఖానాలోని పలు పదార్థాలను పరిశీలించారు. వంట నూనెల నాణ్యత, అపరిశుభ్రంగా ఉండడంతో పరిశుభ్రత మెరుగుపరచాలన్నారు. అనంతరం పదార్థాల శాంపిల్స్ సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాడులలో సేకరించిన శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందని, రిపోర్టులు సక్రమంగా రాకుంటే యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏ వ్యాపారానికైనా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆయన వెంట చీరాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, వినియోగదారుల ఫోరం కన్వీనర్ దాసరి ఇమ్మానియేలు, సిబ్బంది ఉన్నారు.


పప్పు దినుసులలో కల్తీలు

రాలిన ఆశలు..!

అకాల వర్షంతోపాటు విరుచుకుపడుతున్న ఈదురు గాలులు మామిడి రైతుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించుకున్న పంట చేతికొచ్చే సమయానికి టన్నుల కొద్దీ మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతుల బాధ వర్ణనాతీతంగా ఉన్నాయి. దిక్కుతోచని స్థితిలో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.


రామయ్య తోటలో నేలరాలిన బంగినపల్లి కాయలు

- ఈదురు గాలులతో మామిడికి దెబ్బ
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రత్తిపాడు: గత మూడు, నాలుగు రోజులుగా పగలు విపరీతమైన ఎండ కాస్తున్నప్పటికీ, మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆకాశం మేఘావృతమై వానలు కురుస్తున్నాయి. దీనికి తోడు భయంకరమైన శబ్దాలతో ఉరుములు, మెరుపులు, భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈ గాలులు మామిడి రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రత్తిపాడు మండలం నడింపాలెం పదహారో జాతీయ రహదారి సమీపంలో కొందరు రైతులు మామిడి తోటలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఏడాదంతా స్వేదం చిందించి వ్యయప్రయాసలకోర్చి పంట సాగు చేశారు. కౌలుతో కలిపి సాగుకు రూ. 3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. కాపు బాగా రావడం, ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో కాస్త ధైర్యంగా ఉన్నారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో ఈదురుగాలులు మూడు రోజులుగా ముప్పేట దాడి చేస్తుండటంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. గాలుల దెబ్బకు కాయలు నేలరాలడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు.


పెద్ద శివయ్య తోటలో రాలిన కాయలు కుప్పగా పోసిన దృశ్యం

మార్కెట్‌కు వెళితే దక్కని ధర

బహిరంగ మార్కెట్‌లో మామిడి పంట రకాన్ని బట్టి టన్ను రూ. 35 వేల నుంచి రూ. 50 వేల వరకు ధర పలుకుతోంది. ఈదురుగాలులకు కాయలు రాలడంతో పగలడం, గీతలు పడటం, డాగులు పడ్డాయి. దీంతో మార్కెట్‌కు తీసుకువెళ్లిన రైతులకు చేదు అనుభవం మిగులుతుంది. టన్ను రూ. 3 వేలకు అడుగుతుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఖర్చులూ వచ్చే పరిస్థితి లేదు

పంట బాగుంది... మరో పది, పదిహేను రోజుల్లో చేతికొస్తుందనుకున్నా. ఇంతలోనే ఈదురుగాలులతో కాయలన్నీ నేలరాలాయి. సుమారు 15 టన్నులకు పైగా కాయలు రాలిపోయాయి. వాటిని మార్కెట్‌కు పంపిస్తే టన్ను రూ.3 వేలకు అడిగారు. కనీసం ఖర్చులు కూడా వచ్చేలా లేవు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఆళ్ల రామయ్య, నడింపాలెం, ప్రత్తిపాడు మండలం

కన్నీళ్లే మిగిలాయి

ఈ ఏడాది కౌలుకు తీసుకుని మామిడి సాగు చేశాను. బంగినపల్లి, చిత్తూరు, తెల్లరసాలు, మిమాయత్తులు.. వంటి రకాలు సాగుకు సుమారు రూ.నాలుగు లక్షలు పెట్టుబడి అయ్యింది. మరో వారం, పది రోజుల్లో పంట చేతికొస్తుందనుకుంటే ఇలా నేలరాలిపోయాయి. ఇప్పుడు కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి.

– ఎం. పెద్ద శివయ్య, నడింపాలెం, ప్రత్తిపాడు మండలం

దేశాభివృద్ధికి సాంకేతికత అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరువెస్ట్: దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే మానవ వనరులతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల నుంచి స్థానిక రింగురోడ్డులోని ఐటీసీ–వెల్కమ్ హోటల్లో భూ సర్వే, రికార్డుల డిజిటలైజేషన్‌పై జరుగుతున్న కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో పెమ్మసానితోపాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్నతాధికారులతోపాటు అనేక మంది మేధావులు ఈ వర్క్‌షాప్‌లో తమ అనుభవాలను పంచుకున్నారన్నారు. భవిష్యత్తులో ప్రజలకు భూపరమైన సమస్యలు తలెత్తకుండా ఇది ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పట్టణాల్లో రెవెన్యూ రికార్డులు పక్కాగా అమలు చేయడం, భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియోస్పాటిల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్(నక్షా) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. పట్టణాల్లో పారదర్శకమైన, సమర్థ పాలన తీసు కొచ్చేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. నక్షా పైలట్ ప్రాజెక్ట్ ద్వారా దేశంలో 152 మున్సిపాలిటీలను ఎంపిక చేశారని తెలిపారు. రాష్ట్రంలో కుప్పం, ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, మంగళగిరి, ఏలూరు, తిరుపతి నగరపాలక సంస్థలున్నాయని తెలిపారు. వీటిలో ఉన్న 524 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న 9.5 లక్షల ఆస్తులను సర్వే చేసి డిజిటలైజేషన్ చేయనున్నామని తెలిపారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జి.జయలక్ష్మి, డీఓఎల్ఆర్ కార్యదర్శి మనోజ్‌జోషి, డీఓఎల్ఆర్ డైరెక్టర్ డి.ఎస్. జోషి, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, సబ్ కలెక్టర్ సంజనా సింహ ఉన్నారు.

ప్రేక్షకాదరణ ఉన్నంతకాలం నాటకం సజీవం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ
- పేటలో ప్రారంభమైన నాటికల పోటీలు


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ కందిమళ్ల జయమ్మ

చిలకలూరిపేటటౌన్ / యడ్లపాడు: ప్రేక్షకులు ఆదరించిన కాలం నాటకరంగం నిలిచి ఉంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. చిలకలూరిపేట కళానిలయం, సీఆర్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించే రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి 9వ ఆహ్వాన నాటికల పోటీలను శుక్రవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తొలిరోజు సభాకార్యక్రమం జరిగింది. చిలకలూరిపేట కళానిలయం అధ్యక్షులు చెరుకూరి కాంతయ్య అధ్యక్షత వహించిన ఈ సభలో ఆమె మాట్లాడుతూ కందిమళ్ల నారాయణమూర్తి స్థాపించిన కళా సదస్సు నియోజకవర్గంలో ఎందరో కళాకారులకు, రచయితల్ని, నాటక సమాజాలకు ప్రోత్సహించి వేదికగా నిలిచిందన్నారు. నేడు కళాపరిషత్ నిర్వహణకు భాగస్వాములైన సీఆర్ క్లబ్ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సినీ, టీవీ నటులు మల్లాది శివన్నారాయణ, కళాసదస్సు అధ్యక్షులు కందిమళ్ల నారాయణమూర్తి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, రంగస్థల దర్శకులు, నటులు షేక్ షఫీ, ఆళ్ల హరిబాబు, కొత్త శివ, నాగభైరు బ్రహ్మానందం, మున్సిపల్ మాజీ ప్రతిపక్షనాయకులు షేక్ జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అనంతరం 'రైతేరాజు' నాటిక ప్రదర్శించారు. కంచర్ల సూర్య ప్రకాష్ రచించిన దీనికి కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. ఈ నాటికను కళాంజలి హైదరాబాద్ వారు ప్రదర్శించారు. రెండో ప్రదర్శనగా 'మా ఇంటి మహాభారతం' నాటికను చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ సమర్పించగా, మద్దుకూరి రవీంద్రబాబు రచన, దర్శకత్వం వహించారు. 'బ్రహ్మస్వరూపం' నాటికను విజయవాడ మైత్రి కళానిలయం వారు ప్రదర్శించారు. శ్రీస్నిగ్ధ రచించారు. టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు. నాటికలు వేటికవే ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

అదుపు తప్పి కారు బోల్తా


కారును కరకట్టపైకి లాగిస్తున్న పోలీసులు


ప్రమాదానికి గురైన కారు

ఉండవల్లి అమరావతి కరకట్టపై ప్రమాదం

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ముఖ్యమంత్రి నివాసానికి కొద్ది దూరంలో శుక్రవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి ఉండవల్లి అమరావతి కరకట్ట మీదుగా సచివాలయానికి వెళుతుండగా కారు అదుపు తప్పి కిందకు జారిందని పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున కురిసిన అకాల వర్షం కారణంగా కరకట్ట వెంబడి మార్జిన్‌లో ఉన్న మట్టి కరిగి ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు. అదుపుతప్పిన కారును క్రేన్ సహాయంతో బయటకు తీసి కేసు నమోదు చేశామని వివరించారు. కారును పైకి తీసే సమయంలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు పోలీసులు తెలిపారు.

పశువుల పాకపై పిడుగు


మంటల్లో కాలిపోతున్న పశువుల పాక

ప్రత్తిపాడు: పశువుల పాకపై పిడుగు పడిన ఘటన పెదనందిపాడు మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతోపాటు ఈదురుగాలులు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. పెద్ద శబ్దాలతో ఉరుములు ఉరుముతూ పిడుగులు పడ్డాయి. మండల పరిధిలోని గోగులమూడికి చెందిన సీహెచ్ నరసింహారావుకు చెందిన పశువుల పాకపై పిడుగు పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పాకలో పశువులు లేకపోవడంతో నష్టం జరగలేదు. కాలిపోయిన పాకను మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కాశీంపీరాతో పాటు స్థానిక నాయకులు పరిశీలించారు. బాధితుడిని అడిగి వివరాలను తెలుసుకున్నారు.

చేపల చెరువులో మునిగి జాలరి మృతి


ఏడుకొండలు (ఫైల్)

నూజెండ్ల: చెరువులో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం చింతాయగారిపాలెం గ్రామానికి చెందిన చాపల ఏడుకొండలు (55) చేపలు పట్టే కూలీగా జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో వి.అప్పాపురం గ్రామంలో పరిసరాలలో తోటి వారితో కలసి రోజూలాగే చెరువులో దిగి వల వేసి చేపలు లాగుతుండగా హఠాత్తుగా నీటిలో మునిగిపోయాడు. పక్కనే ఉన్న వారు అతనిని ఒడ్డుకు చేర్చి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఏడుకొండలు మృతి చెందినట్లు తోటి జాలర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐనవోలు ఎస్సై బి.వి. కృష్ణారావు తెలిపారు.

పిడుగుపాటుకు పూరిల్లు దగ్ధం


పిడుగుపాటుకు కాలిపోయిన నివాసం


దెబ్బతిన్న సామగ్రి

అమరావతి: మండల పరిధిలోని మండెపూడి హెల్త్ సబ్ సెంటర్ సమీపంలో పూరిల్లుపై గురువారం రాత్రి పిడుగు పడటంతో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సఫావత్ సాంబయ్యకు చెందిన పూరిల్లుపై గురువారం అర్ధరాత్రి పిడుగు పడింది. ఇంటిలోని సామగ్రితోపాటుగా ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. సుమారు రూ.50 వేల వరకు నష్టం సంభవించింది. తహసీల్దార్ డానియేల్ మాట్లాడుతూ ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ఈ ఘటనపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నామని వివరించారు.

ప్రైవేటు బడుల్లో ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలకు ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు గడువు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వి.సుబ్బారావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 15 వ తేదీ నుంచి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించారు.

జాబ్‌మేళా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న చిలకలూరిపేటరోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించే జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. నియోజకవర్గం, పరిసర ప్రాంత యువతి యువకులు అందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో టెక్ మహీంద్ర, టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్, మాస్టర్ మైండ్, గోదావరి ఆంధ్ర కార్పొరేటివ్ బ్యాంక్, అఫెక్స్ సొల్యూషన్, వి చేంజ్ సొల్యూషన్, అక్రో సాఫ్ట్ సొల్యూషన్స్, హెటిరో డ్రగ్స్ వంటి సుమారు 21 కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.10వేలు నుంచి రూ.40వేలు వరకు ఉండవచ్చని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు, రామాంజనేయులు, వీరాంజనేయులు, క్రిష్ణవేణి డిగ్రీ కళాశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిట్యాల ఎస్ఐ అఫ్రీన్ నసీహా తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగేడ గ్రామానికి చెందిన తోకల రవి(45), అతని తల్లి నాగమ్మ, డ్రైవర్ పోల్ సాగర్‌తో కలిసి కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి పరిధిలోని దూన్ పంజాబీ దాబా వద్దకు రాగానే లారీ అకస్మాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కారును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న రవికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా పడి వృద్ధురాలు మృతి

లక్ష్మీపురం: ఆటో బోల్తా పడి అందులో వెళ్తున్న వృద్ధురాలు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఇమ్మడి సామ్రాజ్యం (64) భర్త, బంధువులతో కలిసి శుక్రవారం తెల్లవారు జామున అదే గ్రామానికి చెందిన ఆటోలో జొన్నలగడ్డ నుంచి గుంటూరు రైల్వే స్టేషన్‌కు బయలు దేరారు. అరండల్‌పేట 11వ లైన్ వద్దకు చేరుకునే సరికి వర్షం, విపరీతమైన గాలుల వల్ల ఆటో బోల్తా పడింది. సామ్రాజ్యం తలకు తీవ్ర గాయం అయింది. దీంతో భర్త కృష్ణార్జునరావు, స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు వెల్లడించారు. అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

అస్తిపంజరం పురుషుడిదిగా నిర్ధారణ

వివరాలు వెల్లడించిన తాడేపల్లి పోలీసులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం ఇప్పటం బకింగ్‌హామ్ కెనాల్ కట్ట వెంబడి ఉన్న డొంకరోడ్డు నుంచి పోలీసులు అస్తిపంజరం తరలించగా, మృతుడి వివరాలను తాడేపల్లి పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ.. ఆదివారం అస్తిపంజరం ఉందని సమాచారం తెలియడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. అక్కడకు క్లూస్‌టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించామని తెలిపారు. అస్తిపంజరం కావడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలోని ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. పురుషుడి అస్తిపంజరంగా తెలిపారని పేర్కొన్నారు. ఈ వివరాలను మిగిలిన పోలీస్‌స్టేషన్‌లకు పంపించామని, అక్కడ మిస్సింగ్ కేసులు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. డీఎన్ఏ పరీక్ష ద్వారా ఆ మృతదేహం ఎవరిదో గుర్తిస్తామని తెలిపారు. ఇది హత్యా? ఆత్మహత్యా? అనే వివరాలు ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. మిగిలిన వివరాలను త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.